



ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ కేఆర్ శ్రీరామ్‌తో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి ● కేఆర్ శ్రీరామ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న సభాపతి అప్పావు, మంత్రులు దురైమురుగన్, రఘుపతి తదితరులు

మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ కేఆర్ శ్రీరామ్ ప్రమాణ స్వీకారం

ప్యారిస్, న్యూస్‌టుడే: మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ కేఆర్ శ్రీరామ్ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆయనతో శుక్రవారం ప్రమాణం చేయించారు. ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న ఎస్వీ గంగాపూర్వాలా పదవీ విరమణ చేయడంతో న్యాయమూర్తి ఆర్.మహాదేవన్ ఇన్‌ఛార్జి చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులవడంతో కృష్ణకుమార్ ఇన్‌ఛార్జి చీఫ్ జస్టిస్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాంబే హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్‌ను మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు ఇచ్చారు. ఆ మేరకు కేఆర్ శ్రీరామ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సదాశివం, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు, సభాపతి అప్పావు, మంత్రులు దురైమురుగన్, పొన్ముడి, కేఎన్ నెహ్రూ, రఘుపతి, మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్ సెల్వం, మాజీ మంత్రి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు. జస్టిస్ కేఆర్ శ్రీరామ్ 2025 సెప్టెంబరు 27 వరకు పదవిలో కొనసాగుతారు. ముంబై యూనివర్సిటీ, లండన్‌లో న్యాయవిద్యను అభ్యసించిన ఆయన 1986లో న్యాయవాద వృత్తి ప్రారంభించారు. 2013లో బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

తప్పు చేసినవారిని కఠినంగా శిక్షించాలి: శఠగోప రామానుజ జీయర్

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ వ్యవహారంలో తప్పు చేసిన వారికి కఠిన శిక్ష విధించాలని శ్రీవిల్లిపుత్తూర్ శఠగోప రామానుజ జీయర్ అన్నారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో.. లడ్డూ తయారీలో వాడే నెయ్యి కల్తీ అయినట్లు వెలువడిన సమాచారం ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీశాయన్నారు. ఈ తప్పునకు పాల్పడిన వారి ఒప్పందం రద్దు చేసి, కఠిన శిక్ష విధించాలని కోరారు. ఎవరి మతాన్ని వారు అనుసరిస్తే ఎలాంటి సమస్య ఉండదన్నారు. ఏ మతాన్నైనా, దేవుడినైనా కించపరిచేలా మాట్లాడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినశిక్ష విధించేలా చట్టాన్ని తీసుకురావాలన్నారు.

63 ఏళ్లలో తమిళనాడు ఘనత | **జాతీయ సగటుతో పోల్చితే భారీగా పెరిగిన తలసరి ఆదాయం** | **కీలక సంస్కరణలతోనే సాధ్యమైందంటున్న నిపుణులు**

పడి లేచి.. ఆర్థిక పరుగులు

ఆర్థిక సంక్షోభాలు దేశాన్ని కుదిపేసిన ఘటనలున్నాయి. రాష్ట్రాలు కుదేలైన దాఖలాలున్నాయి. ఆర్థికంగా ఎలా ఎదుగుదామని ప్రభుత్వాలు ఆలోచనల్లో పడిన సందర్భాలున్నాయి. ఈ కష్టాలన్నింటినీ అధిగమించి తమిళనాడు ఆర్థికాభివృద్ధిలో వేగంగా దూసుకుపోతోంది. తాజాగా విడుదలైన కేంద్ర ప్రభుత్వం నివేదిక ఈ విషయాల్ని స్పష్టం చేసింది.

ఈనాడు–చెన్నై

ప్రధానమంత్రి దగ్గరుండే ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) తాజాగా నివేదిక విడుదలచేసింది. 1960 నుంచి 2024 దాకా రాష్ట్రాల ఆర్థిక ప్రగతి ఎలా ఉందో విశ్లేషించి పలు అంశాలు వెల్లడించింది. 64 ఏళ్లలో ఏయే రాష్ట్రాలు ఎలా నిలదొక్కుకోగలిగాయో చెప్పింది. ఇందులో తమిళనాడు బలం ప్రత్యేకంగా కనిపించింది.

171 శాతం అధికం..

తాజా గణాంకాలు చూస్తే.. 2023-24లో దేశ తలసరి ఆదాయం సగటుతో పోల్చితే తమిళనాడు ఏకంగా 171.1 శాతం ఎక్కువగా ఉంది. సగటుకన్నా ఎక్కువగా తలసరి ఆదాయం వృద్ధిలో 5వ స్థానంలో కొనసాగుతోంది. తమిళనాడుకన్నా ముందు.. దిల్లీ, తెలంగాణ, కర్ణాటక, హరియాణా రాష్ట్రాలున్నాయి. జాతీయ సగటుతో పోల్చితే రాష్ట్ర తలసరి ఆదాయం వేగంగా పెంచుకుంటూ వెళ్లడంలో తమిళనాడు ప్రభావమంతంగా పనిచేసిందని నివేదికలో పేర్కొన్నారు. 1990ల్లో జాతీయ సగటుకన్నా 71 శాతం అదనంగా తలసరి ఆదాయాన్ని కలిగి ఉండటం వెనుక రాష్ట్ర సత్తాను చాటుతోంది.

అప్పటి పరిస్థితి ఇదీ..

1960లలో దేశ జీడీపీలో తమిళనాడు నాలుగో స్థానంలో ఉంది. అప్పట్లో రాష్ట్ర వాటా 8.7 శాతం. ఆ తర్వాత ఆర్థిక సంక్షోభాలు రాష్ట్రాన్ని కుదిపేశాయి. తమిళనాడు వాటా దారుణంగా దిగజారడం మొదలైంది. అనంతరం నెమ్మదిగా పుంజుకోవడంతో గాడిలో పడింది. దేశ ఆర్థిక ప్రగతిని నడిపించడంలో మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌కు తోడుగా తమిళనాడు కీలకపాత్ర పోషించాయి. మిగతా రాష్ట్రాలతో పోల్చితే తమిళనాడు ఈ కోవలో ప్రత్యేకంగా నిలిచింది. 1960-61లో 8.7శాతంగా ఉన్న జీడీపీలో వాటా.. 1990-91కి 7.1 శాతానికి పడిపోయింది. ఆ తర్వాత కూడా అగ్ర రాష్ట్రాలైన మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ జీడీపీ వాటాలో తగ్గుముఖం పడుతోంటే.. వాటికి భిన్నంగా తమిళనాడు పైకి ఎగిసింది. ఇది దేశానికే బలం చేకూర్చినట్లయింది. అప్పటినుంచి క్రమంగా ఆదాయాన్ని పెంచుకుంటూ 2023-24కు దేశ జీడీపీలో 8.9శాతం వాటాతో కొనసాగుతున్నట్లు తాజా నివేదిక వెల్లడించింది.

సామర్థ్యంలోనే సత్తా..





తమిళనాడు విపత్తుల్ని ఎదుర్కోవడంలో వినూత్నంగా ముందుకెళ్తోందని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. ఈ కీలక పరిణామమే పరిశ్రమలు ఎక్కువగా వచ్చేందుకు ఆకర్షిస్తోందని వెల్లడిస్తున్నారు. ఇక్కడ సౌకర్యాలుండటం, విపత్తుల సమయంలో వేగంగా స్పందిస్తుండటం పరిశ్రమలు పెరిగేందుకు కలిసొచ్చిందని అభిప్రాయపడుతున్నారు. ఇతరులపై ఆధారపడకుండా స్వతహాగా పరిస్థితుల్ని చక్కదిద్దుకునే సత్తా రాష్ట్రానికున్నట్లు విశ్లేషిస్తున్నారు.

విధానాలే మార్చాయి..



రాష్ట్ర ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో తీసుకొచ్చిన సమగ్ర ప్రక్షాళనలు రాష్ట్రాన్ని ముందుకు నడిపించినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ప్రధానంగా అభివృద్ధి చెందాల్సిన శాఖల్లో ప్రభావమంతమైన పాలసీలు చేయడం ఇందులో కీలకంగా మారిందని వివరిస్తున్నారు. ప్రత్యేకించి తయారీరంగంతో పాటు ఐటీ, పౌరసేవల్లో గణనీయ మార్పులొచ్చాయని అంటున్నారు. ఈ తరహా పోకడే రాష్ట్ర ఆర్థిక ప్రగతిని ముందుకు నడిపించిందని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఆయా రంగాలు ఉద్యోగ కల్పనలో బాగా ముందున్నాయని స్పష్టత ఇస్తున్నారు.





రెండు రోజులపాటు భారీ వర్షాలకు అవకాశం



ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రెండు రోజులపాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆ మేరకు శనివారం రాష్ట్రంలో కొన్ని చోట్ల, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, కోయంబత్తూరు కొండ ప్రాంతాలు, వేలూర్, తిరుప్పత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, నామక్కల్, కరూర్, విరుదునగర్, తెన్‌కాశి, తిరునెల్వేలి, కన్నియాకుమరి జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీవర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రంలో కొన్ని చోట్ల, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, కోయంబత్తూరులోని కొండ ప్రాంతాలు, నీలగిరి, తిరుప్పూరు, తేని, దిండుక్కల్, మదురై, విరుదునగర్, శివగంగై, పుదుక్కోట్టై జిల్లాలోని ఒకటి రెండు చోట్ల భారీవర్షానికి అవకాశం ఉన్నట్లు వివరించింది. చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతమై కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.




ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం చెన్నై ఎగ్మూర్ ప్రభుత్వ మ్యూజియం వద్ద కళాశాలల విద్యార్థినుల సందడి

రాణిమేరి కళాశాలలో వివిధ రాష్ట్రాల సంప్రదాయ దస్తుల్లో విద్యార్థినులు

బాధ్యులు మూల్యం చెల్లించాల్సిందే
లడ్డూ వ్యవహారంపై నటి ఖుష్బూ

సైదాపేట, న్యూస్‌టుడే: హిందూమతాన్ని అగౌరవపరచటాన్ని ఎవరూ సహరించరని ప్రముఖ నటి, భాజపా నాయకురాలు ఖుష్బూ తెలిపారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై ఆమె స్పందించారు. తాను ఇస్లాం మతాన్ని ఆచరించే ముస్లిం కుటుంబంలో జన్మించానని, హిందూ కుటుంబంలో వివాహం చేసుకున్నానని అన్నారు. తనకు అన్ని మతాలు ఒకటేనని తెలిపారు. మత సామరస్యం అంటే అన్ని మతాలను గౌరవించటం అన్నారు. తిరుపతి లడ్డు వ్యవహారంలో ఎవరు బాధ్యులైనా మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ప్రకటనలో తెలిపారు.

పథకాలకు నిధులివ్వండి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం సౌత్‌బ్లాక్‌లోని కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. పథకాల నిధుల విడుదల, జాలర్ల సమస్యలను ప్రత్యేకంగా ప్రధాని వద్ద ప్రస్తావించారు. అనంతరం స్టాలిన్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధానంగా మూడు డిమాండ్లను ప్రధాని ముందుంచానని చెప్పారు. చెన్నై మెట్రోరైలు మొదటి దశ నిర్మాణ పనుల్లానే రెండోదశను కూడా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించాలని అందుకు కేంద్రం నిధులు ఆలస్యం కాకుండా విడుదల చేయాలని కోరానన్నారు. రెండోది సర్వశిక్షా అభియాన్ కింద తమిళనాడుకు మొదటిదశ నిధులు విడుదల చేయాలని కోరానన్నారు. మూడోది రాష్ట్ర మత్స్యకారుల సమస్యలు తెలియజేశానన్నారు. శ్రీలంక నావికాదళం తరచూ జాలర్లను అరెస్టు చేస్తోందని, తగిన పరిష్కారం చూపాలని కోరినట్లు పేర్కొన్నారు. స్టాలిన్ ప్రధానిని కలిసేందుకు గురువారం రాత్రి దిల్లీ చేరుకున్నారు. ఆయనకు ఎంపీలు టీఆర్ బాలు, కనిమొళి, దిల్లీలో ప్రత్యేక ప్రతినిధి ఎస్‌కేఎస్ విజయ్ తదితరులు ఘనస్వాగతం పలికారు.



మోదీతో సీఎం స్టాలిన్ భేటీ

అన్ని వర్గాలు ఏకమైతేనే విజయం: ఓపీఎస్



ఆదిత్తనార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఓపీఎస్, ఆయన మద్దతదారులు

సైదాపేట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకేలో అన్ని వర్గాలు ఏకమవకపోతే ఏ ఎన్నికల్లోనూ విజయం సాధించలేమని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం తెలిపారు. తమిళ పితామహుడు సీపీ ఆదిత్తనార్ 120వ జయంతిని పురస్కరించుకుని చెన్నై ఎగ్మూర్‌లోని ఆయన విగ్రహానికి మాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. సామాన్యులు సులభంగా తమిళం చదవటంలో ఆదిత్తనార్ కృషి ఎనలేదని తెలిపారు. అన్నాడీఎంకేలో కార్యకర్తలు ఏకం కాకుండా విజయం సాధించటం కష్టమన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రెండాకుల గుర్తు కోరి తీసుకుని ఏడు స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయారని పేర్కొన్నారు. 13 నియోజకవర్గాల్లో మూడో స్థానానికి పరిమితమయ్యారని చెప్పారు. ఒక్కచోట కూడా గెలవకపోవడానికి ప్రధాన కారణం కార్యకర్తలను విభజించటమేనని తెలిపారు. కార్యకర్తలు ఏకమై అన్నాడీఎంకేను బలపరచాలని సూచించారు. తాను రామనాథపురం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో దిగి 33 శాతం ఓట్లు పొందానని తద్వారా కార్యకర్తలు, ప్రజలు తనవైపు ఉన్నారనేది స్పష్టమవుతోందన్నారు. ● చెన్నై, శివారు ప్రాంతాల్లో తరచూ విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయన విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. డీఎంకే ప్రభుత్వ తీరును ఖండించారు.

దేశాభ్యున్నతిలో ట్రస్టుల కీలకపాత్ర

ఏఆర్ఈటీ స్వర్ణోత్సవ వేడుకల్లో మాజీ రాష్ట్రపతి




వేడుకల్లో పాల్గొన్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: ఆగర్వాల్ రిలీఫ్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్(ఏఆర్ఈటీ) శుక్రవారం స్వర్ణోత్సవాలను ఘనంగా జరుపుకొంది. 1974లో స్థాపించిన సంస్థ అంచెలంచెలుగా ఎదుగుతూ ఉన్నత విద్యాసంస్థగా స్థానాన్ని సంపాదించుకుంది. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథిగా తుగ్లక్ పత్రిక సంపాదకుడు ఎస్.గురుమూర్తి పాల్గొన్నారు. రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగిస్తూ.. దేశాభ్యున్నతికి ఛారిటబుల్ ట్రస్టులు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. త్వరలో ఏఆర్ఈటీ మరో పాఠశాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఏఆర్ఈటీ మేనేజింగ్ ట్రస్టీ మురారీలాల్ సొంతాలియా, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. స్వర్ణోత్సవాల సందర్భంగా విద్యార్థులకు క్రీడలు, క్విజ్ పోటీలు నిర్వహించారు.

స్టాలిన్‌కు ఇళయరాజా కృతజ్ఞతలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దివంగత ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చెన్నైలో నివాసం ఉన్న వీధికి ఆయన పేరు పెట్టడంపై ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సంబంధించి విడుదల చేసిన ప్రకటనలో.. 'ఆప్తమిత్రుడు బాలు జ్ఞాపకార్థం ఆయన నివసించిన ఇల్లు ఉన్న రోడ్డుకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్డుగా నామకరణం చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు రాష్ట్ర ప్రజలు, సినీ పరిశ్రమ తరఫున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా'నని పేర్కొన్నారు.

సమావేశానికి వస్తున్న మేయర్ ప్రియ ● హాజరైన సభ్యులు, అధికారులు

చెత్త వేస్తే రూ.5వేలు జరిమానా

జీసీసీ కౌన్సిల్ సమావేశం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై మహానగర కార్పొరేషన్ (జీసీసీ) కౌన్సిల్ సమావేశం శుక్రవారం మేయర్ ప్రియ అధ్యక్షతన రిప్పన్ భవనంలో జరిగింది. నగరాన్ని శుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు పలు తీర్మానాలు నెరవేర్చారు. బహిరంగప్రదేశాలలో చెత్త వేస్తే ఇప్పటివరకు రూ.1000 జరిమానా వసూలు చేస్తుండగా దానిని రూ.5 వేలకు పెంచారు.

■ చెట్ల వ్యర్థాలను వేస్తే విధించే జరిమానా రూ.200 కాగా ఇకపై రూ.2వేలు వసూలు చేయనున్నారు. ■ వ్యాపారులు చెత్తడబ్బా లేదా బుట్టపెట్టుకోవాలి. లేదంటే రూ.1000 జరిమానా విధిస్తారు. ■ మెరినా, బెసెంట్‌నగర్, అన్నానగర్‌లాంటి ముఖ్య ప్రదేశాల్లో ఏవైన కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలి. లేదంటే రూ.5వేలు జరిమానా చెల్లించాలి. ■ కార్పొరేషన్ పాఠశాలల్లో భద్రత కోసం కాపలాదారులను ప్రధానోపాధ్యాయులే నియమించుకోవాలి. ■ వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ప్రజాపనులు, జలవనరులశాఖ అధికారులు పూడికతీత పనులు ముమ్మరం చేయాలని సభ్యుడు కన్నన్ కోరారు. రహదారులు గుంతలమయంగా ఉన్నాయని, మరమ్మతులు చేయాలని తెలిపారు. ■ ఆస్తిపన్ను ఏడాదికి 6శాతం పెంచాలన్న నిర్ణయాన్ని విడనాడాలని కాంగ్రెస్ సభ్యుడు శివరాజశేఖర్ కోరారు. ముంబయి, కోల్‌కత, బెంగళూరు కార్పొరేషన్లలో మాదిరి స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ల పదవులను రొటేషన్ పద్ధతిలో ఇవ్వాలన్నారు. మరింతమంది సభ్యులకు అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల రవాణా అడ్డుకోవాలి: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల రవాణాను అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు చేపట్టాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిసామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. రెండు రోజుల కిందట చెన్నై ఓడరేవులో రూ.110 కోట్ల విలువైన 112 కిలోల డ్రగ్‌ను కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. మూడేళ్ల డీఎంకే పాలనలో సంఘవిద్రోహులు, అధికార వర్గానికి చెందిన వ్యక్తులు కలిసి రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చారని ఆరోపించారు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడి జైల్లో ఉండి బయటకొచ్చిన వారిని ముఖ్యమంత్రే త్యాగి అని పిలుస్తున్నారని ఎద్దేవా చేశారు.

● కృష్ణగిరి జిల్లా వేప్పన్‌హల్లి రైతులు 45 వేల ఎకరాల్లో సాగు చేసిన ఉద్యానవన పంటలు, కూరగాయలు, ఆకుకూరలు, పూల తోటలను కాపాడేందుకు త్రీఫేజ్ విద్యుత్ అందించని డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ 30న ఆందోళన చేయనున్నట్లు మరో ప్రకటనలో ఈపీఎస్ తెలిపారు.

● అన్నాడీఎంకే ఐటీ వింగ్ విడుదల చేసిన ప్రకటనలో... రాజ్‌భవన్ వెళ్లి టీ తాగారని, హెచ్.రాజాతో కరచాలనం చేశారని, అన్నామలైను కలిశారని, రాజ్‌నాథ్ సింగ్‌తో నాణెం విడుదల చేయించారని.. ఇవన్నీ ఎందుకని ప్రశ్నించారు. ప్రస్తుతం కృతజ్ఞతలు తెలిపేందుకు స్టాలిన్ దిల్లీ వెళ్లారని తెలిపింది.

టీవీకే మహానాడుకు సిద్ధమవుతున్న వస్త్రాలు




ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం(టీవీకే) తొలి మహానాడు విళుపురం జిల్లా విక్రవాండిలో అక్టోబరు 27న నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. మహానాడులో పాల్గొనే ముఖ్య నిర్వాహకులు తెల్లపంచె, చొక్కా ధరించి రావాలని గురువారం జరిగిన సమావేశంలో పార్టీ ప్రధానకార్యదర్శి బుస్సీ ఆనంద్ సూచించారు. ఈ నేపథ్యంలో పంచె, చొక్కాల తయారీకి తిరుప్పూర్, ఈరోడ్ కుమారపాళ్యం ప్రాంతంలోని కంపెనీలకు ఆర్డర్లు ఇస్తున్నారు. తిరుప్పూర్‌కు చెందిన ప్రముఖ కంపెనీ యజమాని ఒకరు మాట్లాడుతూ.. నిర్దేశిత సమయానికి వస్త్రాలు తయారుచేసి ఇస్తామని చెప్పారు. ఆర్డర్లు ఇంకా పెరిగే అవకాశాలున్నాయని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలులో కుంభకోణం
సీబీఐ దర్యాప్తునకు అన్బుమణి డిమాండ్

సైదాపేట, న్యూస్‌టుడే: ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు కుంభకోణంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. తమిళనాడు విద్యుత్ బోర్డుకు 2021-2023 మధ్య కాలంలో ఎక్కువ ధరకు 45,800 ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేయటంతో ప్రభుత్వానికి రూ.400 కోట్ల నష్టం జరిగినట్లు తెలుస్తోందన్నారు. దర్యాప్తు చేయాలని తమిళనాడు లంచం నిరోధక, పర్యవేక్షణ డైరెక్టరేట్‌లో అరప్పోర్ ఇయక్కం ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఏడాదవుతున్నా చర్యలు తీసుకోలేదన్నారు. ఈ వ్యవహారంలో మొదటిగా అప్పట్లో విద్యుత్ శాఖ మంత్రిగా పని చేసిన సెంథిల్‌బాలాజీని దర్యాప్తు చేయాలన్నారు. అవినీతి కేసులో జైల్లో ఉండి వచ్చిన ఆయన్ను ముఖ్యమంత్రి స్టాలిన్ త్యాగిలా చిత్రీకరిస్తున్నాడని పేర్కొన్నారు. అలాంటప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల కుంభకోణం వ్యవహారంలో న్యాయం దక్కదని తెలిపారు. సీబీఐ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించాలని డిమాండ్ చేశారు.

ఈడీ కార్యాలయానికి సెంథిల్ బాలాజీ

ప్యారిస్, న్యూస్‌టుడే: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో హాజరై సంతకం చేశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యి 471 రోజులు పుళల్ జైల్లో శిక్ష అనుభవించిన ఆయనకు సుప్రీంకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన గురువారం సాయంత్రం జైలు నుంచి బయటకువచ్చారు. శుక్రవారం ఉదయం నుంగంబాక్కంలోని ఈడీ కార్యాలయంలో దర్యాప్తు అధికారి సమక్షంలో హాజరై సంతకం చేశారు.

పంటల బీమా పథకంలో అవకతవకలు

■ పీఆర్ పాండియన్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: పంటల బీమా పథకం నుంచి ప్రైవేట్ సంస్థలను తొలగించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని అన్ని రైతు సంఘాల సమన్వయకర్త పీఆర్ పాండియన్ కేంద్ర వ్యవసాయ శాఖ ఉమ్మడి కార్యదర్శి రితీశ్ చౌహాన్‌కు లేఖ పంపారు. దేశంలో వాతావరణ మార్పుల వలన వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు దెబ్బతిన్న రైతులకు సాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని, 2021 నుంచి ఈ పథకంలో పలు మార్పులు చేశారని తెలిపారు. ఆ మేరకు బీమా నగదు అందజేయడానికి 20 ప్రైవేట్ సంస్థలకు అనుమతి ఇచ్చారని, ఆ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల తరఫున చెల్లిస్తున్న ప్రీమియం మొత్తాన్ని ప్రైవేట్ బీమా సంస్థలు సరైన మార్గంలో ఉపయోగించడం లేదన్నారు. రైతులకు తగిన పరిహారం చెల్లించడం లేదని ఆరోపించారు. కావున పథకంలో అవకతవకలను నివారించాలని పేర్కొన్నారు. బాధిత రైతులకు తగిన పరిహారం లభించే విధంగా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

2 లక్షల టన్నుల వరి ధాన్యం కొనుగోలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇప్పటివరకు రైతుల నుంచి నేరుగా 2 లక్షల టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశారు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) తరఫున రైతుల నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ధాన్యం కొనుగోలు చేస్తోంది. వాటిని బియ్యంగా మార్చి రేషన్ దుకాణాలకు తరలిస్తున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి కొనుగోలు సీజన్ ప్రారంభమైంది. ప్రత్యక్ష కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 2 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు అధికారులు తెలిపారు.

కాంచీపురంలో ట్రాఫిక్ ఆంక్షలు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం సమీపంలో శనివారం డీఎంకే వజ్రోత్సవ వేడుకలు జరుగనున్న నేపథ్యంలో నగరంలో శనివారం ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు జిల్లా ఎస్పీ షణ్ముగం తెలిపారు. ఆ మేరకు పొన్నేరి కరై మార్గం గుండా నగరంలోకి ప్రవేశించే వాహనాలు కీళ్అంబి, వైట్ గేట్ మార్గం గుండా సభా ప్రాంగణం వద్దకు వెళ్లాలని సూచించారు. కాంచీపురం నుంచి చెంగల్పట్టు వెళ్లే వాహనాలు పాత రైల్వే రోడ్డు వైయ్యావూర్ మార్గం గుండా వెళ్లాలని, చెన్నై, తాంబరం, ఆవడి, చెంగల్పట్టు మొదలైన ప్రాంతాల నుంచి వేడుకలకు వచ్చే వాహనాలు, ప్రజలు వాలాజాబాద్, ముత్యాలపేట మార్గం గుండా పెరియార్ నగర్‌కు చేరుకోవాలని తెలిపారు. కృష్ణగిరి, వేలూర్, తిరుపత్తూర్, రాణిపేట మొదలైన జిల్లాల నుంచి వచ్చే వాహనాలు, ప్రజలు కీళ్అంబి, చెవిలిమేడు, ఓరిగై జంక్షన్ గుండా, విళుపురం, దిండివనం, తిరువణ్ణామలై మొదలైన జిల్లాల నుంచి వచ్చే వాహనాలు చెవిలిమేడు, ఓరిగై జంక్షన్ గుండా పెరియర్ నగర్‌కు చేరుకోవాలని పేర్కొన్నారు.



పరికరం గురించి డైరెక్టరు కామకోటికి వివరిస్తున్న ఓ విద్యార్థిని

ఐఐటీఎంలో ఘనంగా నిర్మాణ్ డెమో డే

వడపళని, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ (ఐఐటీఎం)లో 'నిర్మాణ్ డెమో డే-2024' పేరిట వార్షిక వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. యువ ఆవిష్కర్తలు తయారుచేసిన పలు రకాల పరికరాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఏఐ, హెల్త్‌టెక్, డీప్‌టెక్, సస్టైనబులిటీ రంగాలకు చెందిన ఆవిష్కరణలు ప్రదర్శనలో కొలువుదీరాయి. 30 అంకుర సంస్థల ఆలోచనలు ప్రదర్శనలో చోటు చేసుకున్నట్టు ఐఐటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఐఐటీ డైరెక్టరు కామకోటి ప్రదర్శనను శుక్రవారం ప్రారంభించారు. డెమో డేలో జరుగుతున్న ప్రీ ఇన్‌క్యుబేటర్ కార్యక్రమంతో ఐఐటీ మరో అడుగు ముందుకేస్తోందని, విద్యార్థుల్లోని ప్రతిభ, నైపుణ్యం వెలుగుచూస్తాయని, ఎంటర్‌ప్రెన్యూర్లకు ఉపయోగకరంగా ఉంటుందని ఐఐటీ డైరెక్టరు కామకోటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 26 స్టార్టప్‌లు ఇప్పటికే గ్రాడ్యుయేట్ అయ్యాయని, రూ.వెయ్యి కోట్లకు పైగా మూలధనానికి చేరుకుని రూ.108 కోట్లకు పైగా నిధులు సమీకరించుకున్నాయని తెలిపారు. అర్బన్ మ్యాట్రిక్స్, మొడులస్ హౌసింగ్, టాన్ 90, బోకల్, ఇన్‌ఫైయా ల్యాబ్స్, ఇన్‌ఫోర్స్ మెల్లోస్, సస్టెయిన్స్, జీఎంఎస్, ఫైరోమ్ టెక్నాలజీస్ వంటి సంస్థలు నిర్మాణ్‌లో గ్రాడ్యుయేట్ స్థానాన్ని సాధించాయని వివరించారు. వెంచర్ ఈస్ట్ సంస్థ జనరల్ పార్ట్‌నర్ డాక్టర్ శ్రీకాంత్ గౌరవ అతిథిగా, స్టార్టప్ ఎంగేజ్‌మెంట్, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ డైరెక్టర్ నవరతన్ కటారియా, ఐఐటీ విద్యార్థుల డీన్, ఆచార్యులు సత్యనారాయణ ఎన్.గుమ్మడి, ఐఐటీ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సలహాదారు, ఆచార్యులు ప్రభు రాజగోపాల్, విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు.

◆ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, తమ స్టార్టప్‌లకు ఇది పునాది లాంటిదని యువరాజ్ రాథూర్ అనే విద్యార్థి పేర్కొన్నారు. తమలో దాగి ఉన్న ఆలోచనలను బయటికి తెచ్చేందుకు మంచి పర్యావరణంతో కూడిన సహకారాలందుతున్నాయని ఆయన వివరించారు. సొంతంగా స్టార్టప్ వ్యవస్థాపకుడు, విద్యార్థి ఆకాశ్ ఆనంద్ మాట్లాడుతూ.. నిర్మాణ్‌తో సాంకేతిక, ఆర్థిక సహకారం, అనుభవజ్ఞులైన వారితో నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసుకునేందుకు వీలుగా ఉంటుందని పేర్కొన్నారు.

మియాట్‌లో క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం



చికిత్స పొందిన ఉషారాణితో వైద్యులు

వడపళని, న్యూస్‌టుడే: మానవ మెదడులో ప్రాణానికి హాని కలిగించే, వైద్య పరిభాషలో వ్యవహరించే 'బ్రెయిన్ అనెయురిజం' అనే వ్యాధితో బాధపడుతున్న మహిళకు అధునాతన 'స్టెంటింగ్ టెక్నిక్‌'తో అందించిన చికిత్స విజయవంతమైందని మియాట్ ఆసుపత్రి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. 65 ఏళ్ల ఉషారాణి 'బ్రెయిన్ అనెయురిజం' సమస్యతో బాధపడుతోంది, మెదడుకు రక్తాన్ని అందించే చోట 17 మి.మీ పరిమాణంలో కణితి ఏర్పడిందని వివరించింది. క్లిష్టతరమైన శస్త్రచికిత్సను ఆధునిక సాంకేతికత, అనుభవమున్న వైద్యులతో వై స్టెంట్ విధానంతో కాకుండా 'నెక్‌స్టెంట్ విధానంతో' చేసి విజయవంతమైనట్లు తెలిపింది. చికిత్స పొందిన ఉషారాణి క్షేమంగా ఉన్నారని పేర్కొంది.

గుజరాత్ వరదల్లో చిక్కుకున్న తమిళ పర్యాటకులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: గుజరాత్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరదల్లో తమిళనాడుకు చెందిన పర్యాటకులు గురువారం సాయంత్రం చిక్కుకున్నారు. వారిని పోలీసులు రక్షించారు. ఇందుకు సంబంధించి పావ్‌నగర్ విపత్తుల నిర్వహణ అధికారి సతీష్ జాంబుజా మాట్లాడుతూ.. తమిళనాడుకు చెందిన 55 మంది పర్యాటకులు పావ్‌నగర్‌లోని కోలియాక్ గ్రామంలో ఉన్న నిష్కళంక మహాదేవ్ ఆలయానికి గురువారం వెళ్లి సాయంత్రం బస్సులో తిరుగు పయనమయ్యారని తెలిపారు. ఆ సమయంలో ఉన్నట్టుండి నదిలో వరద రావడంతో పర్యాటకులు వరదలో చిక్కుకున్నారని, లారీలో ఆ ప్రాంతానికి చేరుకొని బస్సులో ఉన్న వారిని కిటికీల ద్వారా సురక్షితంగా బయటకు తీసి లారీలో ఉంచామని, వరద తీవ్రత తగ్గిన తరువాత సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు




కార్యక్రమంలో విస్తాలి శంకరరావు తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: సాహితీవేత్తల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 'సాహిత్యకారుల జీవన చిత్రాలు' శీర్షికలో భాగంగా శుక్రవారం మద్రాసు వర్సిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత గుర్రం జాషువా 130వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జలదంకి కోదండరామిరెడ్డి జాషువా సాహిత్య సారాన్ని, ఆయన రచనలోని గొప్ప పద్యాలను అద్భుతంగా గానం చేసి సభికులను రంజింపజేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డాక్టర్ నిర్మలా పళనివేలు కవి గొప్పతనాన్ని వివరించారు. జాషువా జయంతిని ఏర్పాటు చేసిన మద్రాసు వర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుల ఆలోచన అభినందనీయమని ఆత్మీయ అతిథిగా విచ్చేసిన బిట్రా గజగౌరి పేర్కొన్నారు. మద్రాసు క్రిస్టియన్ కళాశాల ఆచార్యులు డాక్టర్ శ్రీపురం యజ్ఞశేఖర్, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ జడా సుబ్బారావు, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, ఆచార్య ఎల్బీ శంకరరావు దంపతులు, డాక్టర్ ఎలిజబెత్ జయకుమారి, డాక్టర్ మోహనకుమారి, డాక్టర్ ఏవీ శివకుమారి, పీసీ పాపయ్య, హజరత్తయ్య, నాగేశ్వరరావు, నెల్లుట్ల శ్రీనివాసులు, ధనుంజయ్, తెలుగు శాఖ ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు. వర్సిటీ తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ పాండురంగం కాళియప్ప, విస్తాలి శంకరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేషన్ దుకాణాల్లో మినప్పప్పు పంపిణీకి చర్యలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాలలో మినప్పప్పు పంపిణీ చేసేందుకు పరిశీలిస్తామని ఆహారశాఖ మంత్రి చక్రపాణి పేర్కొన్నారు. రాష్ట్రంలో 3 లక్షల మంది కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోగా 1.50 లక్షల దరఖాస్తులు పరిశీలించినట్లు చెప్పారు. అర్హులందరికి కార్డులు అందజేస్తున్నట్టు తెలిపారు. సేలంలోని ఓ రేషన్ దుకాణంలో వస్తువులను ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పద్ధతిని అమలుచేస్తే కొలతల సమస్య తలెత్తదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సమావేశమై రేషన్ దుకాణాలలో అదనంగా కిలో చక్కెర, మినపప్పు అందజేయడానికి పరిశీలిస్తామని పేర్కొన్నారు.



కోట పరిసరాలను పరిశీలిస్తున్న యునెస్కో బృందం

సెంజి కోటలో యునెస్కో బృందం పర్యటన

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని విళుపురం జిల్లా సెంజిలోని పురాతన కోటను వారసత్వ సంపదగా గుర్తించడానికి యునెస్కో ఎంపిక కమిటీ ప్రతినిధి వాజాంగ్‌లీ నేతృత్వంలో కేంద్ర పురావస్తుశాఖ అధికారులు శుక్రవారం సెంజి కోటను సందర్శించారు. బృందానికి సెంజి ఎమ్మెల్యే, మంత్రి సెంజి మస్తాన్ నేతృత్వంలో కలెక్టరు పళని స్వాగతం పలికారు. తరువాత బృందం కోటలో పర్యటించారు. వారికి పురావస్తు శాఖ అధికారులు లఘుచిత్రం ద్వారా కోట విశేషాలను వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, రాజా దేశింగ్ వంశానికి చెందిన 30 మందితో సమీక్ష నిర్వహించారు.

డీఎంకే వజ్రోత్సవాలకు బ్రహ్మాండంగా ఏర్పాట్లు






రూపుదిద్దుకున్న సభా ప్రాంగణం

కాంచీపురం, న్యూస్‌టుడే: అరిజ్ఞర్ అన్నాదురై స్థాపించిన డీఎంకే పార్టీ 75 ఏళ్లు పూర్తిచేసుకున్న తరుణంలో వజ్రోత్సవాలను అన్నాదురై జన్మించిన కాంచీపురంలో నిర్వహించాలని డీఎంకే నిర్ణయించింది. ఆ మేరకు పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి స్టాలిన్ 28వ తేదీ కాంచీపురం సమీప పెరియార్‌నగర్‌లో ఉగ్ర పచ్చయప్పన్ బాలుర కళాశాల ప్రాంగణంలో జరపడానికి నిర్ణయించారు. అక్కడ వారం రోజులుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాంచీపురం ఉత్తర జిల్లా కార్యదర్శి, మంత్రి టీఎం అన్బరసన్, దక్షిణ జిల్లా కార్యదర్శి, ఉత్తిరమేరూర్ ఎమ్మెల్యే కె.సుందర్ పర్యవేక్షిస్తున్నారు. సభా ప్రాంగణంలో సుమారు 50 వేల మంది కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి ఉదయనిధి కటౌట్లతో ప్రవేశద్వారాన్ని ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో పార్టీ పతాకాలు రెపరెపలాడుతున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి పాల్గొనడానికి వచ్చే నిర్వాహకులు, కార్యకర్తలకు తగిన వసతులు కల్పించనున్నారు.

జీవన్మృతుడి అవయవదానం



అర్జునన్ (పాతచిత్రం)

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా ఊటీ నంజనాడు ప్రాంతానికి చెందిన అర్జునన్ (62) రక్తపోటు కారణంగా స్పృహ కోల్పోవడంతో ఈనెల 25న కుటుంబీకులు ఊటీ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. ఈ నేపథ్యంలో అర్జునన్ జీవన్మృతి చెందారు. ఆయన అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. ఆ మేరకు గురువారం వైద్యులు శస్త్రచికిత్స ద్వారా రెండు మూత్రపిండాలు, కాలేయం తొలగించి ఈరోడ్, కోవై ఆస్పత్రులకు తరలించారు.

గ్రూప్-2, 2ఏ ప్రిలిమ్స్ ఫలితాలు డిసెంబరులో విడుదల

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న 507 గ్రూప్-2, 1,820 గ్రూప్-2ఏ పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ ఈనెల 14వ తేదీ ప్రిలిమ్స్ రాతపరీక్షలు నిర్వహించింది. ఇదిలా ఉండగా ఈ పరీక్షల ఫలితాలు డిసెంబర్‌లో విడుదల చేయనున్నట్లు టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. అదేవిధంగా మెయిన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు పేర్కొంది.

అంగన్‌వాడీ కేంద్రాల పునరుద్ధరణ



కార్యక్రమంలో పాల్గొన్న సీఐఐ ప్రతినిధులు

వడపళని, న్యూస్‌టుడే: చిన్నారులకు విద్యపై ఆసక్తి కల్పించాలన్న ఉద్దేశంతో భారత పరిశ్రమల సమాఖ్య (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ - సీఐఐ) అంగన్‌వాడీ కేంద్రాలను పునరుద్ధరించింది. బుధవారం తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండిలో జిల్లా సహాయ కలెక్టరు ఆయుష్ గుప్తా సమక్షంలో పునరుద్ధరించిన కేంద్రాలను ప్రారంభించినట్టు సీఐఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పైకప్పుల నుంచి నీరు కారకుండా మరమ్మతులు, కంచె, మరుగుదొడ్లలో మరమ్మతులు, వంట గదులు, నేల మీద రాళ్లు పరచడం, చిన్నారులకు ఆట స్థలం వంటి సదుపాయాలు కల్పించినట్లు వివరించింది. సీఐఐ, కెమిన్ ఇండస్ట్రీస్ కలిసి చేపట్టిన ప్రాజెక్టును సహాయ కలెక్టరు అభినందించారు. కెమిన్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెయిల్ కోరుతూ మహావిష్ణు పిటిషన్

ప్యారిస్, న్యూస్‌టుడే: పాఠశాలలో చేసిన ఉపన్యాసం వివాదాస్పదం కావడంతో అరెస్టయిన మహావిష్ణు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై పోలీసులు సమాధానం ఇవ్వాలని చెన్నై మొదటి అదనపు సెషన్స్ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. చెన్నై సైదాపేటలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పరంపొరుళ్ ఫౌండేషన్ నిర్వాహకుడు మహావిష్ణు చేసిన ప్రసంగం వివాదం కావడంతో ఈనెల 7న పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. ఈ క్రమంలో మహావిష్ణు బెయిల్ కోరుతూ చెన్నై అదనపు సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో.. దివ్యాంగులను కించపరిచేలా తాను మాట్లాడలేదని, తన మాటలు వారిని బాధిస్తే అందుకు బేషరతుగా క్షమాపణ కోరుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా తన ప్రసంగాన్ని ఎడిట్ చేసి యూట్యూబ్‌లో పోస్టుచేశారని, తన పూర్తి ప్రసంగాన్ని వినకుండా పోలీసులు తప్పుడు కేసు నమోదు చేసినట్లు ఆరోపించారు. పోలీసు కస్టడీకి తాను పూర్తిగా సహకరించానని, తన కార్యాలయంలో ఉన్న పత్రాలు మొదలైనవాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. కావున తనకు బెయిల్ ఇవ్వాలని కోరారు. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి.. పోలీసులు దీనిపై సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను అక్టోబరు 3కి వాయిదా వేశారు.



చిన్నారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న సబ్ కలెక్టరు రాష్మిరాణి

అన్నామలై వర్సిటీలో మారథాన్ పోటీలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చిదంబరం అన్నామలై విశ్వవిద్యాలయంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని 'పర్యాటకం.. ప్రశాంతత' అనే అంశంపై కడలూర్ జిల్లా యంత్రాంగం, పర్యాటక శాఖ సంయుక్తంగా మారథాన్ పోటీలు శుక్రవారం నిర్వహించాయి. వర్సిటీ విద్యార్థులు, ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నవారు పాల్గొన్నారు. మారథాన్‌ను సబ్ కలెక్టరు రాష్మిరాణి, వర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రకాష్ తదితరులు ప్రారంభించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు, ఇద్దరు చిన్నారులకు పతకాలు, ధ్రువపత్రాలను సబ్ కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో పిచ్చావరం బోట్ హౌస్ మేనేజర్ ఫైజల్ అహ్మద్, పర్యాటక శాఖ అధికారి కన్నన్ తదితరులు పాల్గొన్నారు.



ఆహారాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

అన్నదానం ఎలా ఉంది?

పళనిలో శాసనసభ హామీల కమిటీ పరిశీలన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పళని దండాయుధపాణిస్వామి ఆలయంలో శాసనసభ హామీల కమిటీ శుక్రవారం అధ్యక్షుడు వేల్‌మురుగన్ నేతృత్వంలో పరిశీలన జరిపింది. ఆలయంలోని సిద్ధ వైద్య సహాయ కేంద్రం, అన్నదాన తయారీని చూశారు. భక్తుల వద్ద నాణ్యత, రుచి అడిగి తెలుసుకున్నారు. ఓట్టన్‌సత్రంలోని శీతల గోదాము, రెడ్డియార్‌సత్రంలోని వెజిటబుల్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ పూంగుడి, సహాయ కలెక్టర్ కిషోర్‌కుమార్, ఎమ్మెల్యేలు వారి వెంట ఉన్నారు.

సీతారాం ఏచూరి కుటుంబీకులకు స్టాలిన్ పరామర్శ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిల్లీలోని దివంగత సీతారాం ఏచూరి నివాసానికి ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం వెళ్లి ఆయన సతీమణి, కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట డీఎంకే లోక్‌సభ కమిటీ అధ్యక్షుడు టీఆర్ బాలు, పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ కనిమొళి, పార్లమెంట్ సభ్యుడు తిరుచ్చిశివ ఉన్నారు. తొలుత సీఎం స్టాలిన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఇతర కూటమి పార్టీ నేతలను కలిసి మాట్లాడారు.





ఏచూరి కుటుంబసభ్యులతో స్టాలిన్ ◆ సోనియాగాంధీతో మాట్లాడుతూ...



5జీ టెస్ట్‌బెడ్ కేంద్రంలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, విద్యార్థులు

ఐఐటీఎంలో 5జీ టెస్ట్‌బెడ్ ప్రాజెక్టును సందర్శించిన కేంద్ర మంత్రి

వడపళని, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్(ఐఐటీఎం)లో మొదటిసారిగా ఏర్పాటైన 5జీ టెస్ట్‌బెడ్ ప్రాజెక్టును కేంద్ర కమ్యూనికేషన్లు, టెలికాం, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శుక్రవారం సందర్శించారు. అనంతరం ఐఐటీలో విద్యార్థులు ఏర్పాటు చేసిన డెమోను తిలకించారు. మంత్రి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 5జీ టెస్ట్‌బెడ్ ప్రాజెక్టుతో భారత్ ప్రపంచంలో మూడో ఆర్థికదేశంగా నిలుస్తుందన్నారు. డైరెక్టరు కామకోటి మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థలు 'వికసిత్ భారత్ 2047' లక్ష్యంగా కొత్త ఆవిష్కరణలు, సాంకేతికతతో ముందుకు సాగుతున్నాయన్నారు. 5జీ టెస్ట్‌బెడ్ నేషనల్ కో-ఆర్డినేటర్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగు విభాగ ఆచార్యులు, భాస్కర రామమూర్తి, ఆచార్యులు రాధాకృష్ణ గంటి తదితరులు ప్రసంగించారు. మంత్రి సింధియాకు ఆచార్యులు కామకోటి జ్ఞాపిక బహూకరించారు.

బాలుడికి రక్తదానం చేసిన వైద్యురాలు



సెల్వతో డాక్టర్ అరుణ రాజేంద్రన్, డాక్టర్ స్మిత జోషి, డీకేఎంఎస్ బీఎంఎస్టీ ఫౌండేషన్ ఇండియా ప్రతినిధి పాట్రిక్ పాల్

వడపళని, న్యూస్‌టుడే: బాలుడికి రక్తదానం చేసి ప్రాణాన్ని కాపాడారో వైద్యురాలు. తిరుచ్చిరాపల్లికి చెందిన సెల్వ 7వ తరగతి చదువుతున్నాడు. అరుదైన 'ఫాన్‌కోని అనీమియా' వ్యాధితో బాధపడుతున్నాడు. బెంగళూరుకు చెందిన డాక్టర్ స్మిత జోషి(26) మొదటిసారిగా తన రక్తాన్ని దానం చేశారు. చెన్నై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛైల్డ్ హెల్త్, అసోసియేట్ ఆచార్యులు డాక్టర్ అరుణారాజేంద్రన్ సెల్వకు ట్రాన్స్‌ప్లాంట్‌తో చికిత్స అందించారని డీకేఎంఎస్ బీఎంఎస్టీ సంస్థ శుక్రవారం ప్రకటనలో తెలిపింది. బెంగళూరులో ఆరోగ్య సంరక్షకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ స్మితా జోషి డీకేఎంఎస్ బీఎంఎస్టీ ఫౌండేషన్ ఇండియాతో కలిసి స్టెమ్ సెల్ డోనార్‌గా మారి, ఇతరులకు సాయం అందించేందుకు ముందుకొచ్చింది. తల్లిదండ్రులకు తెలుపకుండా మరొకరి ప్రాణం కాపాడాలనే లక్ష్యంతో రక్తాన్ని అందించేందుకు ముందుకొచ్చినట్లు పేర్కొంది. ఫాన్‌కొని అనీమియా అనేది అత్యంత అరుదైన వ్యాధి అని, ఎముకలకు హాని కలిగించి, ప్రాణానికే ముప్పు కలుగుతుందని వైద్యులు పేర్కొన్నారు. స్మిత రక్తాన్ని అందించి సెల్వ ప్రాణాన్ని నిలబెట్టినందుకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి ఉదయనిధిని కలిసిన సెంథిల్‌బాలాజీ

సైదాపేట, న్యూస్‌టుడే: బెయిల్‌పై విడుదలైన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ శుక్రవారం రాష్ట్ర యువజన సంక్షేమ, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను కలిశారు. చెన్నైలోని ఉదయనిధి ఇంటికి వెళ్లి కలిశారు. ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ పేజీలో.. జైలు నుంచి బయటకొచ్చిన ఆయన్ను ప్రత్యక్షంగా కలిసి స్వాగతించామని తెలిపారు. ఆయన పనులు విజయవంతమవ్వాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.



ఉదయనిధితో సెంథిల్ బాలాజీ

మాజీ మంత్రి విడుదలతో బిర్యానీ విందు

కరూర్‌లో ఏర్పాటు చేసిన పారిశ్రామికవేత్త



బ్యానర్‌కి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మాజీమంత్రి సెంథిల్ బాలాజీ బెయిల్‌పై విడుదల కావడాన్ని పురస్కరించుకుని కరూర్ జిల్లా చెంబడాపాలయంకు చెందిన పారిశ్రామికవేత్త తోగై మురుగన్ వేడుక చేసుకున్నారు. శుక్రవారం 5 వేల మందికి బిర్యానీ విందు ఇచ్చారు. పుగళూర్ మునిసిపల్ ఛైర్మన్ గుణశేఖరన్, తోగై మురుగన్ తదితరులు సెంథిల్ బాలాజీ బ్యానర్‌కు క్షీరాభిషేకం చేశారు. విందులో పాల్గొన్నవారు మాజీ మంత్రి ఫొటోతో శుభాకాంక్షల నినాదాలు చేశారు. 750 కిలోల బియ్యం, 1,500 కిలోల కోడి మాంసం, 5 వేల గుడ్లతో బిర్యానీ తయారు చేశారు. ఆయన డీఎంకే వీరాభిమాని అయిన తోగై మురుగన్ కరోనా సమయంలో శుభ్రతా కార్మికులకు పాదపూజ చేసి కూరగాయలు, కిరాణా వస్తువులు అందించారు.

యూట్యూబ్ ఛానెల్ మూసివేత ఆదేశం చట్టవిరుద్ధం

మద్రాస్ హైకోర్టు బెయిల్ షరతులను సవరిస్తూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు

దిల్లీ: యూట్యూబర్ ఫెలిక్స్ జెరాల్డ్ బెయిల్ షరతుల్లో ఒకటైన యూట్యూబ్ ఛానల్ 'రెడ్‌పిక్స్24X7'ను మూసివేయాలన్న మద్రాస్ హైకోర్టు ఆదేశాన్ని సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. 'ఆ షరతు చట్టవిరుద్ధం, అసంబద్ధం' అని ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది. ఆ షరతును రద్దు చేసింది. ఫెలిక్స్ జెరాల్డ్‌కు ఈ నెల 6న తామిచ్చిన బెయిల్‌ను ధర్మాసనం నిర్ధారించింది. ఆ ఆదేశాల్లో 'రెడ్‌పిక్స్24X7' ఛానెల్‌ను మూసివేయాలన్న నిబంధన లేదని స్పష్టం చేసింది. తన ఉత్తర్వుల మేరకు ఫెలిక్స్ జెరాల్డ్ బెయిల్‌పై విడుదలయ్యారన్న విషయాన్ని ధర్మాసనం నోట్ చేసుకుంది. మద్రాస్ హైకోర్టు విధించిన మిగిలిన బెయిల్ షరతులు కొనసాగుతాయని తెలిపింది. యూట్యూబర్ జెరాల్డ్ మరో యూట్యూబర్ సవుక్కు శంకర్ ఇంటర్వ్యూను తన 'రెడ్‌పిక్స్24X7' ఛానెల్ ద్వారా ఏప్రిల్ 30న ప్రసారం చేశారు. అందులో మద్రాస్ హైకోర్టు జడ్జీలపై, మహిళా పోలీస్ అధికారులపై దుర్భాషలతో కూడిన వ్యాఖ్యలున్నాయంటూ యూట్యూబర్లు ఇద్దరిపై కేసులు నమోదయ్యాయి. తమిళనాడు ప్రభుత్వం వారిద్దరినీ విడివిడిగా అరెస్టు చేసింది.

పలు రైళ్ల సేవల్లో మార్పు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై బీచ్ యార్డులో జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తాయని దక్షిణ రైల్వే ప్రకటించింది.

06095 తాంబరం - సంత్రాగచ్చి 29న 13.00కు బయలుదేరాల్సిన రైలు 15.30కి నడుస్తుంది. **17651** చెంగల్పట్టు - కాచిగూడ 29న 15.35 రైలు 16.35కు బయలుదేరుతుంది. **17643** చెంగల్పట్టు - కాకినాడ పోర్ట్ 29న 16.00 రైలు 17.00కు బయలుదేరుతుంది.

తొల్‌కుడి సదస్సు ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కయల్విలి సెల్వరాజ్

సైదాపేట, న్యూస్‌టుడే: గిరిజన సంస్కృతి పరిరక్షణ, అభివృద్ధికి సంబంధించి రెండు రోజుల తొల్‌కుడి జాతీయ సదస్సు శుక్రవారం ఏర్పాటైంది. ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ శాఖ తరఫున చెన్నై వేళచ్చేరిలోని ది వెస్టిన్ హోటల్‌లో జరిగిన సదస్సును ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కయల్విలి సెల్వరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి లక్ష్మీప్రియ, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ అన్నాదురై, అదనపు కార్యదర్శి ఉమామహేశ్వరి, పుణెలోని భారత భాషాశాస్త్ర సంస్థ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తన, బయో ధ్రువీకరణశాఖపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై చేపాక్కంలోని వ్యవసాయశాఖ డైరెక్టరేట్‌లో సీడ్, బయో సర్టిఫికేట్ శాఖపై సమీక్షా సమావేశం శుక్రవారం జరిగింది. వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం నేతృత్వం వహించారు. వివిధ పథకాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, ప్రభుత్వ కార్యదర్శి అపూర్వ, విత్తన, బయో ధ్రువీకరణ శాఖ డైరెక్టర్ మురుగవేల్‌పాండియన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ మురుగేశ్ తదితర ప్రభుత్వ ఉన్నతాధికారులు పలువురు పాల్గొన్నారు.

తిరువణ్ణామలై ఆలయ హుండీ ఆదాయం రూ.3.05 కోట్లు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై ఆలయంలో సెప్టెంబరు మాస పున్నమి సందర్భంగా హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రూ.3.05 కోట్ల నగదు, 388 గ్రాముల బంగారం, 1652 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చినట్లు ఆలయ సంయుక్త కమిషనర్ జ్యోతి తెలిపారు.



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

చిట్టీల పేరుతో భారీ మోసం

తిరువళ్లూరు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు సమీప కన్నికాంబపురానికి చెందిన సుబ్రహ్మణ్యం, ఇతని భార్య సరస్వతి, బంధువు ప్రకాశ్ కలిసి చిట్టీల కంపెనీ నిర్వహించారు. తిరుత్తణి, తిరుపతి, రేణిగుంట, బెంగళూరు, పళ్లిపట్టు తదితర ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేసి ఇస్తామని ఆకర్షణ ప్రకటనలు చేశారు. అది నమ్మిన బీరకుప్పం, గోరమంగళం, మాంబాక్కం, తిరుత్తణి ప్రాంతాలకు చెందిన వందలాది మంది చిట్టీలు కట్టారు. తర్వాత వారికి ప్లాట్లు అందజేయలేదు. దీంతో బాధితులు తిరువళ్లూరు జిల్లా ఎస్పీ శ్రీనివాస పెరుమాళ్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టి నిందితులపై చర్యలు చేపడుతామని ఎస్పీ వారికి హామీ ఇచ్చారు.

జీవనాధారం కోల్పోతాం



ఆందోళనలో పాల్గొన్న కార్మికులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ప్రభుత్వ ఆస్పత్రిలో ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఆస్పత్రి ఆసెంబ్లీకి సమీపంలో ఉంది. ఇక్కడ 92 మంది పారిశుద్ధ్య కార్మికులను ఒప్పంద పద్ధతిలో నియమించారు. శుక్రవారం ఉదయం వారు విధులకు వెళ్లకుండా ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. ఏడేళ్ల కిందట తమను తీసుకున్నారని, ప్రస్తుతం కాంట్రాక్ట్ కంపెనీ మారడంతో వచ్చే 1వ తేదీ నుంచి విధులకు రావద్దని చెప్పారన్నారు. ఏళ్లుగా పనిచేస్తున్న తాము జీవనాధారం కోల్పోతామన్నారు. అక్కడికి చేరుకున్న ప్రతిపక్షనేత శివ ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టరు చంద్రకళ

పర్యావరణాన్ని కాపాడుకుందాం

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా కావేరిపాక్కం పంచాయతీ యూనియన్ శంకరన్‌పాడి పంచాయతీలో శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 2 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు చంద్రకళ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో బహుళ ప్రయోజనాలు



యంత్రం ద్వారా విత్తుతున్న దృశ్యం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా వ్యవసాయం, పర్యాటకానికి ప్రత్యేకం. తేయాకు, కూరగాయల సాగులో ముందంజలో ఉంది. జిల్లాలో సుమారు 7 వేల హెక్టార్ల విస్తీర్ణంలో కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. ఊటీ, కున్నూర్, కొత్తగిరిలో క్యారెట్, బీట్‌రూట్, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బంగాళదుంపలు పండించగా గూడలూర్ ప్రాంతంలో కాకర, సొరకాయలు పండిస్తున్నారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించకుండా క్యారెట్, బీట్‌రూట్ పంటలను సాగు చేస్తున్నారు. దీంతో భూసారం దెబ్బతింటోంది. పురుగులు ఆశించి దిగుబడి తగ్గుతోంది. అదే సమయంలో శక్తివంతమైన విత్తనాలు ఉపయోగించడం ద్వారా ఉత్పత్తి ఖర్చుకూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో క్యారెట్ సీడింగ్ యంత్రం ద్వారా ఖర్చు తగ్గించుకునే అవకాశం లభించింది. ఈ చిన్న యంత్రాన్ని ఓ వ్యక్తి సులభంగా హ్యాండిల్ చేయవచ్చు. యంత్రం ముందు భాగంలో ఉన్న రోలర్ నేలలో రంధ్రాలు ఏర్పాటు చేయగా వెనుక వరుసలో అమర్చిన బహుళ పొరలలో విత్తనాలను నింపుతారు. తద్వారా విత్తనాలు భూమిలో సమానంగా పడతాయి. ఈ యంత్రం ఉపయోగించడం ద్వారా సమయం, విత్తనాల వృథా తగ్గడంతోపాటు ఖర్చు సగానికి తగ్గుతుందని ఉద్యానవనశాఖ సంయుక్త సంచాలకురాలు సిబిలా మేరి పేర్కొన్నారు.

భార్య హింసిస్తోందని భర్త ఫిర్యాదు



సెంథిల్‌కుమార్

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై రామనాథపురం ప్రాంతానికి చెందిన సెంథిల్ కుమార్, అశోకా దేవి ఇరు కుటుంబాల సమ్మతితో 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం అశోకా దేవికి ఇదివరకే వివాహమైందని, మొదటి భర్త నుంచి విడాకులు తీసుకోలేదని, ఆ విషయాన్ని దాచి తనను పెళ్లి చేసుకుందని సెంథిల్ కుమార్‌కు తెలిసింది. దీంతో భార్యను నిలదీయగా ఆమె తనను చిత్రహింసలు పెడుతోందని వాపోతూ శుక్రవారం సెంథిల్ కుమార్ కోవై నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తన భార్య అశోకాదేవి తనను హింసిస్తోందని, తాను ఏదైనా మాట్లాడితే పోలీసు స్టేషన్‌లో తనపై వరకట్నం వేధింపుల కేసు పెడతానని తన పుట్టింటి వాళ్లతో కలిసి బెదిరిస్తోందని, తనకు సరిగా భోజనం పెట్టడం లేదని, మందులు ఇవ్వడం లేదని, కావున ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పద్మశ్రీ గ్రహీత.. శతాధిక వృద్ధురాలి కన్నుమూత



పాపమ్మాళ్ (పాతచిత్రం)

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: శతాధిక వృద్ధురాలు, పద్మశ్రీ గ్రహీత పాపమ్మాళ్ అనారోగ్యంతో కన్నుమూశారు. కోవై జిల్లా మేట్టుపాళ్యానికి చెందిన పాపమ్మాళ్ (107)కు వయసు మీదపడినా చురుగ్గా వ్యవసాయ పనులు చేస్తుండేవారు. ఈమె వ్యవసాయంలో సాధించిన ప్రగతికి గుర్తుగా కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. ఈ నేపథ్యంలో అనారోగ్యం కారణంగా ఆమె శుక్రవారం స్వగ్రామంలో కన్నుమూసినట్లు సమాచారం.

అధికారుల తీరుకు నిరసనగా రాస్తారోకో

ఊత్తుకోట, న్యూస్‌టుడే: ఊత్తుకోట పట్టణ పంచాయతీ పరిధిలోని ఎట్టికుళంలో సుమారు 500 మంది నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో వంద మీటర్ల దూరానికి కాంక్రీట్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 50 శాతం పనులు పూర్తయ్యాయి. రెవెన్యూశాఖ అధికారులు కొలతలు నిర్వహించకుండానే రోడ్డు నిర్మించడాన్ని నిరసిస్తూ ఆ ప్రాంతవాసులు ఊత్తుకోటలోని తిరువళ్లూరు రోడ్డులో శుక్రవారం రాస్తారోకోకు దిగారు. పంచాయతీ ఈవో సతీష్, సీఐ తమిళ్‌సెల్వి వారితో చర్చలు జరపడంతో శాంతించారు.



ప్రసంగిస్తున్న మాజీ మంత్రి సెంథమిళన్

ఏఎంఎంకే బహిరంగసభ

శోళింగర్, న్యూస్‌టుడే: ఏఎంఎంకే రాణిపేట జిల్లా విభాగం తరఫున దివంగత ముఖ్యమంత్రి అన్నాదురై 116వ జయంతిని పురస్కరించుకుని బహిరంగ సభ గురువారం రాత్రి శోళింగర్ పెరుమాళ్ ఆలయం వద్ద నిర్వహించారు. శోళింగర్ పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్ అధ్యక్షత వహించారు. మాజీ ఎంపీ గోపాల్, రాణిపేట జిల్లా కార్యదర్శి పార్తిబన్, మాజీ మంత్రి సెంథమిళన్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

రోప్‌కార్ ప్రమాదాల నియంత్రణపై శిక్షణ



శోళింగర్, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా శోళింగర్ కొండపై ఉన్న నరసింహ స్వామి ఆలయానికి భక్తులు వెళ్లడానికి రోప్‌కార్ సౌకర్యం ఉంది. రోప్‌కార్ ప్రమాదంలో చిక్కుకుంటే భక్తులను రక్షించడం ఎలా అనే దానిపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో అరక్కోణంలోని ఎన్డీఆర్ఎఫ్ బృందం పాల్గొని నిర్వాహకులకు శిక్షణ ఇచ్చింది. శోళింగర్ తహసీల్దారు ఆదిలక్ష్మి, ఆలయ కమిషనర్ జయ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల ఇళ్లలో కార్పొరేషన్ సిబ్బంది పని చేస్తున్నారా?

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉన్నతాధికారుల ఇళ్లలో కార్పొరేషన్ ఉద్యోగులు పనిచేస్తున్నారా లేదా అనే విషయమై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కార్పొరేషన్ ఆరోగ్యశాఖ ఆదేశించింది. చెన్నై కార్పొరేషన్‌లో 8వేలకుపైగా పారిశుద్ధ్యకార్మికులు పనిచేస్తున్నారు. ఆరోగ్యశాఖ కింద 1000 మందికిపైగా నర్సులు, అసిస్టెంట్లు విధులు నిర్వరిస్తున్నారు. ఇందులో 40మందికి పైగా వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య ఉద్యోగులను కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉన్నతాధికారుల ఇళ్లలో పనిచేయించుకుంటున్నారనే ఆరోపణలు లేవనెత్తాయి. కార్పొరేషన్ సెంగొడి సంఘ నిర్వాహకులు మాట్లాడుతూ. .అధికారులు కార్పొరేషన్ నుంచి బదిలీ చేసినా ఆ ఉద్యోగులు అక్కడే పనిచేస్తూనే ఉంటారన్నారు. మండల అధికారుల ఇళ్ల నుంచి ఐఏఎస్ అధికారుల నివాసాల వరకు ఈ విధానం అమల్లో ఉందన్నారు. అందుకు వాళ్లకు అదనంగా వేతనం ఇవ్వడం లేదన్నారు. అదనపు సమయం పనిచేయించుకుంటున్నారని చెప్పారు. ఈ వ్యవహారంపై పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశించింది.

అన్నాడీఎంకే నిర్వాహకురాలిపై ఫిర్యాదు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఎంపీ కనిమొళి గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ అన్నాడీఎంకే నిర్వాహకురాలు శశిరేఖపై డీఎంకే మహిళా విభాగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అన్నాడీఎంకే తరఫున నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకురాలు శశికళ డీఎంకే ఎంపీ కనిమొళిపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో శశిరేఖపై చర్యలు చేపట్టాలని డీఎంకే మహిళా విభాగం తరఫున చెన్నై పోలీసు కమిషనరు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

అక్టోబరు 2న మద్యం దుకాణాలు మూసివేత

కాంచీపురం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీ కాంచీపురం జిల్లాలోని అన్ని టాస్మాక్ మద్యం దుకాణాలు, వాటి అనుబంధంగా నిర్వహిస్తున్న బార్లను, విదేశీ మద్యం దుకాణలను మూసి వేయాలని కలెక్టరు కలైసెల్వి పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి తెరిస్తే సేల్స్‌మెన్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కాంచీపురం జిల్లా అన్నాదురై క్రీడా మైదానంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ముఖ్యమంత్రి ట్రోఫీ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శుక్రవారం ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కలెక్టరు కలైసెల్వి - కాంచీపురం, న్యూస్‌టుడే

సైబర్ నేరాలపై అవగాహన

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం ఎంజీఆర్ మహిళా కళాశాలలో శుక్రవారం పోలీస్‌శాఖ తరఫున సైబర్ నేరాలు, మత్తుపదార్థాలతో అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. విళుపురం సైబర్ నేర విభాగ ఇన్‌స్పెక్టరు ప్రియ, లైంగిక నేరాల నియంత్రణ విభాగ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, గీతా, సబ్ ఇన్‌స్పెక్టరు కలైసెల్వి తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, అధ్యాపకులు

మొక్కలు నాటే కార్యక్రమం

వడపళని, న్యూస్‌టుడే: నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్) ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం వేపేరిలోని సెయింట్ క్రిస్టోఫర్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రాంగణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఎన్ఎల్‌సీఐఎల్ ఉద్యోగులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు 75 మంది పాల్గొని మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపల్, కార్యదర్శి డాక్టర్ నిథిల దేవ కారుణ్యం తదితరులు పాల్గొన్నారు.



బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీస్తున్న పోలీసులు

మినీ బస్సు బోల్తా.. నలుగురి మృతి

ప్యారిస్, న్యూస్‌టుడే: మినీ బస్సు బోల్తాపడిన ప్రమాదంలో నలుగురు మృతిచెందిన ఘటన విరుదునగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ సమీప మమ్సాపురం నుంచి శ్రీవిల్లిపుత్తూర్‌కి శుక్రవారం ఉదయం పాఠశాల, కళాశాల విద్యార్థులు, పనులకు వెళ్లే కార్మికులు మినీ బస్సులో బయలుదేరారు. మమ్సాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వెళ్తుండగా అదుపుతప్పి బస్సు బోల్తాపడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బస్సు కింద చిక్కుకున్న వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిలో మాడసామి (29), కళాశాల విద్యార్థి సతీష్‌కుమార్ (20), పాఠశాల విద్యార్థులు వాసు రాజ్ (16) నితీష్‌కుమార్ (17) మృతిచెందారు.

బాధిత కుటుంబాలకు సాయం ప్రకటన

ప్రమాదంలో మృతి చెందినవారికి ముఖ్యమంత్రి స్టాలిన్ సంతాపం తెలియజేశారు. అదేవిధంగా వారి కుటుంబాలకు ఆర్థికసాయం ప్రకటించారు. ఆ మేరకు మృతుల కుటుంబాలకు తలా రూ.2 లక్షలు, క్షతగాత్రులకు తలా రూ.50 వేలు సీఎం జనరల్ రిలీఫ్ ఫండ్ నుంచి అందజేయాలని అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో పాఠశాల విద్యార్థి...



ప్రవీణ్ (పాతచిత్రం)

గుమ్మిడిపూండి: గుమ్మిడిపూండి సమీప తండలచ్చేరికి చెందిన వడివేలు కుమారుడు ప్రవీణ్ (17) సిరుపుళల్‌పేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ప్లస్‌టూ చదువుతున్నాడు. ఇతను శుక్రవారం రాత్రి హోటల్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. కవరప్పేట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మరో ఘటనలో మహిళ...

ఊత్తుకోట: ఊత్తుకోట సమీప రాజపాళ్యానికి చెందిన దీప (40) తిరువళ్లూరు వెళ్లి తన తండ్రి సుబ్రమణితో కలిసి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరింది. కుంజలం వద్ద లారీ ఢీకొనడంతో ఆమె ఘటనాస్థలిలోనే మృతి చెందింది. పెన్నాలూరుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

సినీ ఫక్కీలో ఏటీఎం దొంగల పట్టివేత

- పోలీసులపైకి కాల్పులు జరిపిన దుండగులు
- ఎదురుకాల్పుల్లో నిందితుడి మృతి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లా కుమారపాలయం సమీప వెప్పడై ప్రాంతంలో అతివేగంగా వస్తున్న కంటైనర్ లారీ కొన్ని వాహనాలను ఢీకొని ఆగకుండా వెళ్లింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు 30 వాహనాలలో కంటైనర్ లారీని వెంబడించి సేలం జిల్లా సరిహద్దులో అడ్డుకున్నారు. కంటైనర్‌లో తనిఖీ చేయగా ఉత్తర రాష్ట్రానికి చెందిన కొందరు తుపాకీతో కనిపించారు. వారు తుపాకీతో కాల్పులు జరుపగా కుమారపాలయం ఇన్‌స్పెక్టర్ తవమణి, ఏఎస్సై రంజిత్‌కు బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పులలో లారీలో ఉన్న ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. మిగిలిన వారి కాళ్లకు గాయాలయ్యాయి. ఐదుగురు పట్టుబడ్డారు. కంటైనర్ లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్చారు. ప్రాథమిక దర్యాప్తులో.. వారు కేరళ రాష్ట్రం త్రిశూర్‌లోని ఏటీఎం పగులగొట్టి నగదు దోచుకుని లగ్జరీ కారులో పరారైనట్లు తెలిసింది.



స్వాధీనం చేసుకున్న కంటైనర్ లారీ, పట్టుబడిన నిందితుడు

ఆస్తి వివాదంలో కుమారుడిని చంపిన తండ్రి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుకోట్టై జిల్లా ఆవనతాంగుకోట్టైకు చెందిన సెల్వరాజ్ కుమారుడు ఇన్బరసన్ (27) విదేశాల్లో పనిచేస్తున్నాడు. ఇతను రెండు నెలల క్రితం సొంతూరికి వచ్చాడు. ఇదిలా ఉండగా ఆస్తి పంచి ఇవ్వాలని ఇన్బరసన్ తండ్రిని అడిగాడు. ఈ విషయంలో వారిమధ్య గొడవ జరిగింది. ఆక్రోశానికి గురైన సెల్వరాజ్.. తన స్నేహితుడి సాయంతో కుమారుడిపై దుడ్డుకర్రతో దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లంచం తీసుకున్న అధికారి అరెస్టు



ధనపాల్

సేలం, న్యూస్‌టుడే: సేలం జిల్లా అమ్మాపేటకి చెందిన షర్మిలి తండ్రి విశ్రాంత సహకార సంఘ అధికారి. ఆయన మృతి అనంతరం పింఛను తనకు అందజేయాలని కోరుతూ షర్మిలి జిల్లా కలెక్టరు కార్యాలయంలోని ఖజానా కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు పింఛన్ల విభాగం డివిజన్ పర్యవేక్షక అధికారి ధనపాల్ రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో షర్మిలి అవినీతి నిరోధకశాఖను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు రసాయం పూసిన నోట్లను ధనపాల్‌కు ఇస్తుండగా అనిశా అధికారులు అధికారిని అరెస్టు చేశారు.

పురాతన దేవతా విగ్రహాలు స్వాధీనం



అరెస్టయిన నిందితులు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై టీపీ సత్రం వద్ద పోలీసులు ఈనెల 24న వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనాన్ని ఆపడానికి యత్నించారు. ఆగకుండా వేగంగా వెళ్లడంతో పోలీసులు వెంబడించి వెనుక కూర్చున్న వ్యక్తిని పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న సంచిలో తనిఖీ చేసి మూడు పురాతన పంచలోహ విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద దర్యాప్తు చేయగా.. అతను ఇర్షిద్ అహ్మద్ అని, విగ్రహాలను విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు తెలిసింది. నిందితుడి వివరాల మేరకు అతని స్నేహితులు కేకేనగర్‌కి చెందిన రాజేష్, టీపీ సత్రానికి చెందిన ఆకాష్ ఎబినేజర్‌లను అరెస్టు చేశారు. పురావస్తుశాఖ అధికారులు విగ్రహాలను పరిశీలించారు. అవి 150 ఏళ్లనాటివిగా గుర్తించారు. దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు గురువారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు.



స్వాధీనం చేసుకున్న విగ్రహాలు

బస్సులో మంటలు.. ప్రయాణికులు సురక్షితం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుప్పూర్ నుంచి తిరుచెందూర్‌కు ఓ ప్రభుత్వ బస్సు గురువారం రాత్రి 52 మంది ప్రయాణికులతో బయలుదేరింది. గణేశమూర్తి (55) డ్రైవరు. సికామణి (60) కండక్టర్. రాత్రి 11 గంటల సమయంలో తారాపురం వద్ద వస్తుండగా ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే డ్రైవర్ బస్సుని ఆపి ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో అందరూ దిగి ప్రాణాలు దక్కించుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు.

50 సవర్ల బంగారు నగల చోరీ

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు తాలూకా కొత్తకుప్పం గ్రామానికి చెందిన విజయలునాయుడు (66) మాజీ సైనికుడు. ఈయన శుక్రవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుత్తణి యూనియన్ కేజీకండ్రిగ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగిరాగా తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికెళ్లి చూడగా బీరువాలోని 50 సవర్ల బంగారు నగలు, రూ.70 వేల నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పొదట్టూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురి హత్య కేసులో నలుగురికి మరణశిక్ష

చెన్నై (టీనగర్), న్యూస్‌టుడే: తెన్‌కాశిలో పదేళ్ల క్రితం జరిగిన ఘర్షణలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో నలుగురికి మరణశిక్ష, ఐదుగురికి ఐదు జీవితఖైదులు, ఇద్దరికి రెండు జీవిత ఖైదులు విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే.. తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్ సమీప తిరువేంకటం ప్రాంతంలో 2014 మేలో రెండు సామాజికవర్గాల ప్రజల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఓ వర్గం వారు కత్తులతో దాడి చేయడంతో మరో వర్గంలోని కోయంబత్తూర్ తుడియలూరుకు చెందిన వేణుగోపాల్, మురుగన్, ఉడప్పన్‌కుళం ప్రాంతానికి చెందిన కాళిరాజ్ మృతిచెందారు. ఈ కేసులో పోలీసులు 25 మందిని అరెస్టు చేశారు. కేసు విచారణ తిరునెల్వేలి ప్రత్యేక కోర్టులో జరిగింది. కేసు విచారణలో ఉండగా నిందితుల్లో ముగ్గురు చనిపోయారు. ఈ నేపథ్యంలో గురువారం విచారణ ముగిసింది. పొన్నుమణి, కుట్టిరాజ్, గురుస్వామి, ఉలక్కన్, కన్నన్ పేరుతో ఉన్న ముగ్గురు, కాళిరాజ్, మురుగన్, ముత్తుకృష్ణన్, సురేష్‌లు దోషులుగా తేలారు. మరో 11 మంది నిర్దోషులుగా విడుదలయ్యారు. దోషులలో పొన్నుమణి, గురుస్వామి, ముత్తుకృష్ణన్, కాళిరాజ్‌కు మరణశిక్ష, మిగిలినవారిలో ఐదుగురికి ఐదు జీవిత ఖైదులు, మరో ఇద్దరికి రెండు జీవిత ఖైదులు విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.



శిక్షపడిన దోషులు

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా శుక్రవారం సాయంత్రానికి క్యూలైన్‌లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 7 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. వీరికి దాదాపు 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ. 300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని నాలుగు కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. వీరికి రెండు గంటల్లో దర్శనం లభించనుంది. గురువారం శ్రీవారిని 61,328 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.84 కోట్ల హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది.